క్లుప్తంగా

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన న్యాయమూర్తి



సదుపాయాలపై ఆరా తీస్తున్న జడ్జి శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి సీహెచ్‌వీఎస్ శ్రీనివాస రావు శుక్రవారం నగర సమీపంలోని షిరిడీ సాయి వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడ వృద్ధులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సాయం పొందొచ్చని ఆయన తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో శుక్రవారం జరిగిన డిగ్రీ పరీక్షల్లో చూసి రాతలకు పాల్పడిన ఏడుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా ఉదయం సెషన్‌లో జరిగిన మూడు, ఐదవ సెమిస్టర్ పరీక్షలకు 5,753 మందికి గాను 5,488 మంది హాజరు కాగా 265 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షకు 830 మందికి గాను 749 మంది హాజరు కాగా 81 మంది గైర్హాజరయ్యారన్నారు. కర్నూలు శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, కర్నూలు వాసవీ మహిళా కళాశాల డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నంద్యాల అక్షర డిగ్రీ కళాశాల, కర్నూలు సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కళాశాల, సాయికృష్ణ డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఏడుగురు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా వారిని డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): సంక్రాంతిలోపు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామచంద్రయ్య, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు డి.గౌస్‌దేశాయ్, బి.గిడ్డయ్య హెచ్చరించారు. శుక్రవారం వామ పక్షాలు, కాంగ్రెస్, జనసేన ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఉద్యోగాలు తీసివేస్తామని భయభ్రాంతులకు గురి చేయడం అన్యాయమన్నారు. కాగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 32వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని గ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి పి.నిర్మల, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు సందర్శించి మద్దతు తెలిపారు. దీక్షల్లో అంగన్‌వాడీ ఉద్యోగుల జేఏసీ కమిటీ సభ్యులు బి.రేణుక, అరుణ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఎమ్మిగనూరులో రజక వృత్తిదారులపై దాడి చేసిన తెలుగు హనుమంతు, చిన్న హనుమంతు, రవి, కేశప్ప, గోవిందు, గురురాజులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రజక ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలోని కర్నూలు రోడ్డు సమీపంలో ఉన్న సున్నపు బట్టీల ప్రాంతంలో దోబీఘాట్, రజక సంఘం వృత్తిదారుల కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు స్థలాన్ని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కేటాయించారన్నారు. ఈ స్థలంలో రజక వృత్తిదారుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం హద్దులు ఏర్పాటు చేసుకుంటుండగా దాడి చేసినట్లు చెప్పారు. వెంటనే దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏపీ జట్టుకు మూడో స్థానం



మూడవ స్థానంలో నిలిచిన ఏపీ జట్టు

కర్నూలు (టౌన్): రాజస్తాన్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ జూనియర్ బాలుర చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ జట్టు మూడో స్థానంలో నిలిచిందని టీమ్ మేనేజర్ రుద్రారెడ్డి తెలిపారు. జిల్లా నుంచి హ్యాండ్ బాల్ క్రీడాకారులు జగదీష్, రియాజ్, అభి ప్రాతినిధ్యం వహించారన్నారు. జట్టు శిక్షకుడిగా కీర్తి వెంకటేష్ వ్యవహరించారు.

16న రామిరెడ్డి తాత ఆరాధన

కల్లూరు: స్థానిక అవధూత రామిరెడ్డి తాత ఆరాధన మహోత్సవం ఈ నెల 16న నిర్వహించనున్నట్లు తాత సేవా సంస్థాన్ అధ్యక్షులు దాసరి రామచంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం మేలుకొలుపు సుప్రభాత, పంచామృతాభిషేకం, అర్చన, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. హిందూ ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థల పీఠాధిపతుల ఆధ్వర్యంలో అవధూత రామిరెడ్డి తాత కాంస్య విగ్రహ శోభాయాత్ర ఉంటుందన్నారు.

యువతకు వివేకానంద ఆదర్శం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన



వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(హాస్పిటల్): స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రాజ్‌విహార్ సెంటర్‌లోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏటా జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని నిర్వహించుకుకుంటామని, అదే రోజు వివేకానందునికి యువతతో లోతైన అనుబంధం ఉన్నందున కేంద్ర ప్రభుత్వం జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. యువతను సరైన మార్గంలో నడిపించేందుకు వివేకానంద ఎన్నో విజయ రహస్యాలను అందరితోనూ పంచుకున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుంటారన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా యువత ఉన్న దేశం మనదే అని, దేశాభివృద్ధిలో యువత పాత్ర చాలా కీలకమని, వివేకానందుని స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి యువత పాటుపడాలని సూచించారు. యువత స్వామి వివేకానంద మార్గంలో పయనించి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలన్నారు. ప్రపంచంలో ప్రతి దేశం, ప్రతి వ్యక్తి స్వామి వివేకానందుడిని ఎంతగానో గౌరవిస్తారని, దానికి కారణం వివేకానంద భారతదేశం తరపున అమెరికా వెళ్లి తన మాట తీరుతో అక్కడి ప్రజలందరి చేత శభాష్ అనిపించుకున్నారన్నారు. మన దేశంలో ఆధ్యాత్మిక విషయాల గురించి, సనాతన ధర్మం గురించి విశ్వానికి ఎంతో చక్కగా ఆయన వివరించారన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలను అనుసరించిన వారి వ్యక్తిత్వం కచ్చితంగా మారుతుందన్నారు. వివేకానందుడు యువతకు ప్రేరణనిచ్చే సూక్తులు, స్ఫూర్తివంతమైన సందేశాలను జిల్లా కలెక్టర్ గుర్తు చేశారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ పీవీ రమణ, రిటైర్డ్ టీబీ ఆఫీసర్ డాక్టర్ మోక్షేశ్వరుడు, వివిధ విద్యాసంస్థల అధినేతలు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి

కర్నూలు (లీగల్): వివేకానందుడు ప్రపమంచ మేధావి అని, ఆయన మాట ప్రతి వ్యక్తి జీవితంలో ఆచరణాత్మక బాట అని న్యాయవాదులు పేర్కొన్నారు. శుక్రవారం స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నాగభూషణం నాయుడు, మాజీ అధ్యక్షులు వై.జయరాజు, జూనియర్ న్యాయవాదులు మోహన్‌రెడ్డి, శశికుమార్, శ్రీకాంత్, అయ్యస్వామి, జయసింహ పాల్గొన్నారు.



వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న న్యాయవాదులు

యువతకు స్ఫూర్తిప్రదాత

కర్నూలు (టౌన్): యువతకు స్ఫూర్తి ప్రదాత, మార్గదర్శి స్వామి వివేకానందుడు అని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని రాజ్‌విహార్ సెంటర్‌లోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దశదిశలా చాటిన చైతన్య మూర్తి స్వామి వివేకాందుడు అన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ సీపీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు

యువత జాగృతం కావాలి

కర్నూలు కల్చరల్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివేకానంద సర్కిల్ (రాజ్‌విహార్)లోని స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేడుకల్లో పాల్గొన్న వక్తలు, పార్టీలు, సంఘాల అధినేతలు మాట్లాడుతూ యువత జాగృతం కావాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో అనంతమైన శక్తి నిబిడీకృతమై ఉంటుందన్నారు. యువత ఉద్యోగులుగా కాకుండా వ్యవస్థాపకులుగా ఎదగాలన్నారు. వేడుకల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ తదితరులు పాల్గొన్నారు.



మర్యాద పూర్వక కలయిక

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో నిర్వహిస్తున్న స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) వజ్రోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా ఎన్వీ రమణను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్ఆర్‌సీ) ఛైర్మన్ జస్టిస్ మాంధాత సీతారామ మూర్తి, సభ్యుడు డాక్టర్ గోచిపాత శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను ఛైర్మన్, సభ్యుడు కలిసి బొకే అందజేసి నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. హెచ్ఆర్‌సీ కేసులు, ఇతర అంశాలపై కాసేపు మాట్లాడుకున్నారు.

నేడు ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు

కర్నూలుకల్చరల్: కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సాయంత్రం 6.30 గంటలకు ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మనోహర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు స్వర్గీయ పగిడాల పెద్ద జల్ల బాబు సంస్మరణ సభను పురస్కరించుకుని నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. అల్లూరి సీతారామ రాజు ఏకపాత్ర, శ్రీకృష్ణ పడక సీను, భవాని చింతామణి సీను ప్రదర్శనలు ఉంటాయన్నారు.

సేఫ్ కస్టడీ ఆర్టికల్స్‌ను వెనక్కి తీసుకోండి



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ట్రెజరీకి సంబంధించి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచిన సేఫ్ కస్టడీ ఆర్టికల్స్‌ను వెనక్కి తీసుకోవాలని జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌ల్లో మూడేళ్లకుపైగా భద్రపరచిన వస్తువులను వెనక్కి తీసుకోవడంపై అడిషినల్ ఎస్పీ ఎస్.నాగరాజుతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్లకు పైగా భద్ర పరచిన సేఫ్ కస్టడీ ఆర్టికల్స్‌ను ధ్వంసం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 135ను విడుదల చేసిందన్నారు. ఆదిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మూడేళ్లు కాని వస్తువుల వివరాలను కమిటీకి తెలియజేస్తే పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ట్రెజరీ డీడీ రామచంద్రరావు, డీపీఓ నాగరాజునాయుడు, ఉపాధికల్పన అధికారి దీప్తి, డీఈఓ రంగారెడ్డి, ఎస్‌టీఓ కరుణాకర్ పాల్గొన్నారు.

కళలతో సృజనాత్మకత పెంపొందుతుంది

- కేంద్ర సంగీతం నాటక అకాడమీ సభ్యులు, కూచిపూడి నాట్య గురువు కళారత్న భారతి



జ్యోతి ప్రజ్వలనతో పోటీలను ప్రారంభిస్తున్న కళారత్న భారతి

కర్నూలు కల్చరల్: కళలతో సృజనాత్మకత పెంపొందుతుందని కేంద్ర సంగీతం నాటక అకాడమీ సభ్యులు, కూచిపూడి నాట్య గురువు కళారత్న భారతి అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో జాతీయస్థాయి జానపద శాస్త్రీయ నృత్యప్రదర్శన పోటీలు జరిగాయి. ముఖ్య అతిథులుగా ఆమెతో పాటు, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, డాక్టర్ లక్కిరెడ్డి అమరసింహారెడ్డి, వెంకటనారాయణ గుప్త హాజరై విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాట్యం, సంగీతం, సాహిత్యం ఎంతో విలువైనవన్నారు. సంగీతం సాహిత్యంతో పాటు నాట్యం నేర్చుకున్న విద్యార్థులు జీవితంలో అన్ని రంగాల్లో రాణించగలరన్నారు. టీజీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ సుదర్శన్, నిర్వాహకులు కరిముల్లా, సునిత పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

- ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



విద్యార్థులతో ముఖా ముఖిలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కర్నూలు కల్చరల్: విద్యార్థులు ఆధ్యాత్మికతను అలవరుచుకోవాలని ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఎస్‌ఏపీ క్యాంప్ మైదానంలో ఆయన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఎప్పుడైనా తప్పు చేస్తే దానిని వెంటనే తల్లిదండ్రులకు తెలియజేసి క్షమాపణ కోరితే ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదన్నారు. ఒత్తిడిని జయించడానికి ఆసియా కథలను చదవాలని సూచించారు. తాను తెలుగు, సంస్కృత భాషలపై ఉన్న అభిమానంతో వాటిని నేర్చుకుని ప్రవచన రంగంలోకి అడుగు పెట్టానన్నారు. అలాకాకుండా తాను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటే తన గురించి తక్కువ మందికి మాత్రమే తెలిసేదన్నారు. యువత తమకు అభిరుచి ఉన్న రంగంలో ఇష్టపడి సాధన చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండచిలువల హల్‌చల్



చెట్టుపై ఉన్న కొండచిలువ

పాణ్యం: మండలంలో శుక్రవారం రెండు కొండచిలువలు హల్‌చల్ చేశాయి. పాణ్యంలోని స్టీల్‌ప్లాంట్ వెనక ఉన్న పొలాల్లో కొండచిలువను గుర్తించిన రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పాణ్యం డీఆర్‌ఓ చంద్రహాస్ , బీట్ అధికారి లక్ష్మీదేవి..కొండచిలువను పట్టుకునేందుకు ప్రయత్నించారు. అంతలోనే అది చెట్టుపైకి ఎక్కింది. దీంతో నంద్యాల నుంచి రెస్క్యూటీమ్ తారక్, ప్రవీణ్ వచ్చి 15 అడుగులు పొడవు ఉన్న కొండచిలువను బంధించి, స్థానిక అడవీలో వదిలేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అలాగే గోరుకల్లు-కొట్టాల గ్రామాల మధ్య భారీ కొండచిలువ రోడ్డుపై అడ్డంగా ఉండడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు.

లబ్ధిదారుల కోసమే వికసిత భారత్ సంకల్ప యాత్ర



బస్సు యాత్రను ప్రారంభిస్తున్న టీపీఓ వెంకటలక్ష్మి

కర్నూలు (టౌన్): కేంద్ర ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకే వికసిత భారత్ సంకల్ప యాత్ర చేపట్టినట్లు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ టౌన్ ప్రాజెక్టు అధికారి వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో వికసిత భారత సంకల్ప యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 21 వరకు నగరంలోని వివిధ ప్రదేశాలలో యాత్ర ఉంటుందన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్రాజెక్టు కార్యాలయ సూపరింటెండెంట్ మన్సూర్, మహమ్మద్ ఆలీ పాల్గొన్నారు.

నేడు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రత్యేకాధికారి రాక

కర్నూలు(అర్బన్):జిల్లాలో కొనసాగుతున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను పరిశీలించేందుకు సంకల్ప్ యాత్ర ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్ శనివారం జిల్లాకు రానున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపా రు.శుక్రవారంఆయన మాట్లాడుతూ కర్నూలుఅర్బన్, రూరల్‌లో జరుగుతున్న గ్రామసభల్లో పాల్గొంటారన్నారు.

సంప్రదాయాలు కాపాడుకుందాం

- డీసీఏబీ ఛైర్మన్ మహేశ్వర్‌రెడ్డి
- ముగ్గుల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు



గణేష్ నగర్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కల్లూరు: సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 19వ వార్డులో శుక్రవారం ఏర్పాటు చేసిన సంక్రాంతి ముగ్గుల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముగ్గుల పోటీలో గణేష్ నగర్‌తో పాటు నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ, నాలుగవ తరగతి ఉద్యోగుల కాలనీలకు చెందిన 75 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి బహుమతి మాధవి, రెండో బహుమతి ఉమాదేవి, మూడో బహుమతిని జ్యోతి దక్కించుకున్నారు. విజేతలకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. అలాగే పోటీలలో పాల్గొన్న ప్రతి మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వార్డు నాయకులు శివరాం స్వామి, రమణ, సంతోష్, బాలస్వామి, ప్రమీలమ్మ, సుభాషిణి, లక్ష్మిపతి పాల్గొన్నారు.







మొదటి బహుమతిని అందుకుంటున్న మాధవి, రెండవ స్థానంలో ఉమాదేవి, మూడవ స్థానంలో జ్యోతి

సంప్రదాయానికి చిహ్నాలు.. సంక్రాంతి ముగ్గులు



మాట్లాడుతున్న కేడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ విజయమనోహరి

కర్నూలు (టౌన్): సంక్రాంతి ముగ్గులు సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నాలని కేడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ విజయమనోహరి అన్నారు. శుక్రవారం 17వ వార్డు ఏ.క్యాంపులో వెంకటరామిరెడ్డి, నాగార్జున రెడ్డిల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గొబ్బెమ్మలతో ముగ్గులను అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా విజయమనోహరి నిర్వాహకులను అభినందించారు. ఇటువంటి పోటీల వల్ల మహిళల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రతాప్ రెడ్డి, రమణరెడ్డి పాల్గొన్నారు.

కేబీఆర్ టవర్స్ వద్ద..

నందికొట్కూరు రోడ్డులో ఉన్న కేబీఆర్ టవర్స్‌లో నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు శాంతిభవాని ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి కేడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ విజయమనోహరి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కళా క్షేత్రం ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో శని, ఆదివారాలు(రెండు రోజులు) సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. శుక్రవారం కళాక్షేత్రంలో సంబరాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం సాయంత్రం 6 గంటలకు పౌరాణిక ఏకాంకికల ప్రదర్శన, 14న ఆముదాల మురళి అష్టావధానం ఉంటుందన్నారు.

వృద్ధ పేద కళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నగరంలోని వృద్ధ పేద కళాకారుల నుంచి ఆర్థిక సాయానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. 60 ఏళ్లు దాటిన 50 మందికి జనవరి నుంచి ఏడాది పాటు నెలకు రూ.1,000 చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నామన్నారు. నాటకం, సంగీతం, సాహిత్యం రంగాల్లోని కళాకాకారులు ఈనెల 20వ తేదీలోగా సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తుకు ఫొటో, ఆధార్ కార్డు, కళాకారుడి గుర్తింపు పత్రం, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను జత చేయాలన్నారు. 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఆర్థిక సాయం చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు సంగా ఆంజనేయులు, పాండురంగయ్య, గాండ్ల లక్ష్మన్న పాల్గొన్నారు.

ఎరుకల సత్రం నిర్మాణానికి సహకారం

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో ఎరుకల సత్రం నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఏపీ అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ ఛైర్‌పర్సన్, పాలకొండ ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి హామీ ఇచ్చినట్లు టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మూడు రోజుల క్రితం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆమె అహోబిలం లక్ష్మినరసింహస్వామిని దర్శించుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో అహోబిలంలో ఎరుకల సత్రం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 30 సెంట్ల స్థలాన్ని కేటాయించిన విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఉమ్మడి జిల్లా నుంచేగాక రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు నిర్మించనున్న సత్రం నిర్మాణానికి దాతలు కూడా ముందుకు రావాలని కోరారు.

కమిషనర్ వైఖరితోనే దిగజారిన స్వచ్ఛ ర్యాంకు

కర్నూలు(సెంట్రల్): నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ వైఖరితోనే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో కర్నూలు దిగజారిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. క్లాప్ డ్రైవర్లకు 12 నెలలుగా జీతాలు ఇవ్వకుండా కమిషనర్ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం జీతాల కోసం 27 రోజులుగా క్లాప్ డ్రైవర్లు సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.